# అన్నదాత! సుఖీభవ!



అరజి

మెలిగలి నాగు పిల్లలా పచ్చగా, సన్నగా అతని కాలికి బంగారు కడియం చుట్టుకొని ఉంది. దానికి ఉన్న ఎర్రరాళ్ళు పసుపు పచ్చని ఎండని చూసి, పలకరింపు నవ్వు నవ్వుతున్నట్టుగా మెరుస్తున్నాయి.

అతను పావంచాలను ఒకొక్కటిగా దిగుతున్నాడు. గోదావరి ఒడికి దగ్గరగా ఉన్న పావంచా మీద నిలబడి-నీటి మీద పుప్పొడి జల్లినట్టున్న ఎండని చూసి ఆనందించాడు. తుండుగుడ్డను ఎగువ పావంచా పై నుంచి—

"హర హర మహ దేవ" అంటూ నీటిలో మునిగాడు. మూడు మునకలయిన తర్వాత తలను ఒక్కసారిగా విదిలించాడు. గోదావరిపై వానజల్లు కురిసినట్టయింది. పెద్ద పెద్ద పాయలుగా మెడ వరకూ ఉన్న జుత్తును విదిలించటంతో ఓ క్షణం అతను నిల్చున్న మేర గోదావరి మీద నల్లమబ్బు నిలిచినట్టయింది. పిచ్చుక గూడులా ఉన్న అతని గడ్డంలో నీటి ముత్యాలు !

సుమారుగా అతనికి నల భై ఏళ్ళుంటాయి. నాపరాయి బల్లలా వల్లగా ఉన్నాడు. బల్లకి దారం చుట్టి నట్టుగా యజ్ఞోపవీతం ! మెళ్ళొ రుద్రాక్షమాల !

చేతులెత్తి కర్మసాక్షికి అర్ఘ్యం ఇస్తున్నాడు.

"బాగున్నావా పంతులూ" ఎవరో గట్టు మీంచి కేకేశారు.

"బాగు బాగు" అన్నాడు. నిలువు నీళ్లలో ఎగువ పావంచా మీదికి చేరుకొన్నాడు. తుండుగుడ్డతో కళ్లొత్తుకొని, తర్వాత దాన్నే తుంటికి చుట్టుకొని పంచెను జాడించాడు. జాడించిన పంచెను సగం భుజమ్మీద వేసుకొని— మిగిలిన సగం కొసలను చేతుల్తో గాలిలో ఊపుతూ, ఆరబెడుతూ పావంచాలను ఒకొక్కటిగా ఎక్కి గట్టు మీదికి చేరాడు.

ఆకలిగా ఉంది పంతులుకి!

"నమస్కారం పంతులు" ఊరి ప్రముఖుడు చేతులెత్తలేదు. మాట వరసకి అనేసి అటుగా వెళ్లిపోయాడు. కేకేసి అతన్ని పిలుద్దామనుకొంటూనే ఎందుకో ఆగిపోయాడతను.

బ్రాహ్మలెవరో అస్థికలను నిమజ్జనం చేసేందుకు గోదావరి వైపువస్తున్నారు. పోయిన వ్యక్తిది పెద్దకుటుంబంలా ఉంది పాతిక మందికి పైగా తరలి వస్తున్నారు. పంతులు వాళ్ల దగ్గరకి ఆత్రంగా చేరుకొన్నాడు. అడిగాడు—

" ఏసత్రంలో దిగారు బాబూ! వంటలెవరు చేస్తున్నారు".

ఎగాదిగా చూశారు వాళ్లు పంతుల్ని.

"ఎందుకు" అనడిగాడు.

"నేను వంటబ్రాహ్మణ్ని! శుచిగా రుచిగా వండి పెట్టగలను. తమరు రమ్మంటే ..." అని ఆగాడు

"హోటల్లో దిగాం! భోజన సదుపాయం కూడ అక్కడే ఉంది" అని వెళ్లిపోయారు వాళ్లు.

పంతులు నిరాశతో నిల్చున్నాడు. గత మూడు రోజులుగా అతనికి తిండిలేదు. ఆకలితో అల్లాడి పోతున్నాడు. 'దేహీ' అని ఎవర్నీ అడగడు. అటువంటి మనస్తత్వం కాదు. "కష్టపడతాను! పిడికెడు మెతుకులు పడేయండి !" అంటాడు.

అతను పడే కష్టం—

అతనికి తెలిసిన కష్టం ఒక్కటే!

వంటలు చేయడం!

భారీగా వంటలు చేస్తాడు. పెళ్లి వంటలు, సంతర్పణ వంటలు అంటే పంతులికి పెట్టింది పేరు. వెయ్యిమంది జనాభాకి అరగంటలో వండి వార్చేస్తాడు. అంత వేగం వంటలు చేయడంలో లేదా చేయించడంలో రోజులు తప్పుతాయనుకోనేరు! అది జరగనిపని! ఇంతవరకూ అతని చేతి వంటలు తిని—

"మా భేషుగ్గా ఉన్నాయి" అన్నవారేగాని, మరోమాట అనేవారు లేరు. అతను గరిటె పట్టిన దగ్గర్నుంచీ మెచ్చుకోళ్లే పొందాడు.

"పంతులుకి తండ్రి తర్ఫీదు బాగా ఉంది." అని కొందరంటే!

"ఆ మాట ఎందుకు ? ఒకొక్కరి చేతి మహత్మ్యం అది". అనేవారు కొందరు. ఏదేమయినా పంతులు వంట పసందయిన విందులా ఉండేది.

ఒప్పుకొన్న ప్రకారం కాక, మధ్యలో వంద, యాభై విస్తర్లు లేస్తాయని పెళ్లి వారంటే—

"కుదరదు" అని విసుక్కొనేవాడు కాదు. మళ్లీ పప్పులు, ఉప్పులూ కావాలని సాధించేవాడూ కాదు.

"రానీయండమ్మా! పదిమంది కలిస్తేనే పందిరి కళకళ్లాడేది" అని భరోసా ఇచ్చి కాగుని వెంటనే గాడిపొయ్యి మీదికి లాగేవాడు.

అప్పుడు—

అన్నం ఒక్కటే మళ్లీ వండేవాడు. ఔపత్యాల ఊసు ఎత్తేవాడు కాదు. ఉన్న పప్పు, పులుసులనే మరింత పల్చన చేసి ఉప్పు, కారం, పులుపూ వేసి అందరికీ సర్ది వచ్చేలా చేసేవాడు. దుబరాతనం లేదు.

అందుకే—

పదేళ్లక్రితం—

పెళ్లి వంటలకి, సంతర్పణ భోజనానికి పంతులుగారు పిలిచేందుకు ఊళ్లోవాళ్లు వంతులు వేసుకొనేవారు.

"పంతులూ! పూర్ణం బూరెలు మిగిలిపోయాయి. ఏం చేస్తావో ఆలోచించు!" అని ఇంటి పెద్ద అంటే-

"రాత్రికి అవే బొబ్బట్లండీ" అనేవాడు. బూరెలమీది తొడుగును తీసేసి, పూర్ణంతో పిండివంట మరొకటి చేసేవాడు.

ఉదయం మిగిలిన పప్పు రాత్రికి సాంబారు-

ఉదయం మిగిలిన పులుసు రాత్రికి రసం-

అదీ పంతులు వంట ప్రతిభ! వాసన వేయడం, అరుచి పుట్టడం అతగాడి వంటల్లోనే లేదు.

వందల మందికి తృప్తిగా భోజనాలు ఏర్పాటుచేసే పంతులుకి-

తన నీడన పదిమందికి బతుకు తెరువు చూసే పంతులుకి-

ఇప్పుడు-

గుప్పెడు మెతుకుల్లేవు. ఆకలి కరకర లాడు తూంది.

తాలింపు వాసన ముక్కున సోకింది. పంతులు వాసన వస్తోన్న దిక్కుగా చూశాడు. లాంచీ మీద సరంగు వండుకొంటున్నాడు. వెల్లుల్లి వేయలేదు. వేస్తే వాసన ఇంకా గుమాయించేది అనుకొన్నాడు. వచ్చే వాసనను గ్రహించే వంటల్లో ఎక్కువ తక్కువలు చెప్తాడు. వంట చెడితే ప్రాణం పోయినట్టు గిలగిల్లాడేవాడు. జట్టును అమ్మా, ఆలి చేసి తిట్టేవాడు.

పెళ్లాన్నయినా ఆ విషయంలో లెక్క చేయలేదు!

ఆ రోజు-

శాస్త్రులు గారింటి వంట!

ఓ ప్రక్క సత్యనారాయణ వ్రతం జరుగుతోంది. మరో ప్రక్క వంటలవుతున్నాయి.

పంతులు వంకాయ ముద్దను తొక్కుతుంటే, భార్య అన్నపూర్ణ పప్పును కలియ బెట్టింది.

వడ్డనలు జరిగాయి. అన్నంలో పప్పుకలిపి, గురుగులు కట్టి పులుసు అడుగుతున్నారు.

"వచ్చేవచ్చే" అని వడ్డన వాళ్లు తిరుగుతున్నారు. ముద్దను పులుసులో ముంచి నోట పెట్టారో లేదో భోక్తలు—

"పప్పులో ఉప్పు తక్కువయింది." అని ఒకటే గోల !

తప్పనిసరయి మనిషి మనిషికీ నూరిన ఉప్పును అందిస్తున్నారు శాస్త్రులుగారు. అన్నేళ్లకి తల కొట్టేసినట్లయింది పంతులుకి.

అంతే !

జుట్టుపట్టి, అన్నపూర్ణని తిట్టరాని తిట్లు తిడుతూ అక్కడికక్కడే చెమ్మాలాడ గొట్టేశాడు !

"వద్దు ! వద్దు !" అని ఎవరు ఎంత వారించినా వినిపించుకోలేదు. కోపం వస్తే ఇనుపదేవుడే !

అన్నపూర్ణ సిగ్గుతో కుంచించుకు పోయింది. భర్త కొట్టారని బాధకాదు. పదిమంది ముందూ నోటికొచ్చిన తిట్లు తిట్టారని ఆవేదన చెందింది.

రాత్రి

గంగాళాలకి, వడ్డన పళ్లాలకి, గోళర్ణాలకి మధ్యన పడుకొని ఏడ్చింది. పంతులు వెళ్లి నిల్చున్నాడక్కడ.

"పూర్ణా ! నేను చేసింది తప్పంటావా ?" అనడిగాడు రుద్ధ కంఠంతో.

అన్నపూర్ణ సమాధానం చెప్పక వేల కళ్లతో చూసింది,

"మనకింత తిండి పెడుతూ, పదిమందినీ సంతృప్తిపరిచే ఈ వృత్తిలో అవకతవకలు జరిగితే భరించలేనే ! అందుకే నేనలా రెచ్చిపోయాను. నా తిట్లు ఆశీర్వచనాలే పిచ్చిముండ !" అని ఆమె తలను చేత్తో నిమిరాడు.

అన్నపూర్ణకి కోపం పోయింది. నవ్వొచ్చింది. నవ్వుతూనే మర్నాటివంటలకి తయారయింది. మూడడుగులు లోతు గాడీ పొయ్యి మీద ఎకాఎకీన పది గాగులకి ఎసరు ఎక్కించింది.

జల్లి గంపల్లో బియ్యం కడుగుతున్నారు. కూరగాయలు తరుగుతున్నారు. పిండి వంటకి కావాల్సిన నూనె ఇంకా రాలేదని పంతులు పెళ్లి వాళ్లపై కేకలేస్తున్నాడు.

ఇంతలో

గంపలోని బియ్యం గాగులోనికి పోస్తూ కాలు వసలడంతో అన్నపూర్ణ గాడీలోనికి పడిపోయింది.

మంటలు ! మంటలు !

గాగుల్ని మరగించే మంటలు !

అన్నపూర్ణను నిలువునా దహించే మంటలు !

పంతులు గుండెల్లో మంటలు !

అయితే—

ఆనాడు భార్య చనిపోయిందన్న బాధకంటే వంటలు చెడిపోయాయన్న బాధతో అతను ఏకధాటిగా ఏడ్చాడు.

"శాస్త్రులుగారూ ! ప్రారంభించిన వేళా విశేషం. బాగాలేదు ! నన్ను క్షమించండి." అంటూ బేరానికి ఒప్పుకొన్న డబ్బు కూడా తీసుకోకుండా వెళ్లిపోయాడు.

మామూలుగానే ఆనాడు కూడా—

గోదావరిలో తలస్నానం చేశాడు. సంధ్యావందనం ముగించాడు శుచిగా మరచెంబుతో నీళ్లు తోడ్చుకువచ్చి పాత్ర సామగ్రిని, వంట సామగ్రిని శుద్ధి చేశాడు.

గాడీని మండించి –

అగ్ని దేవుడికి అరచేతి నిండా నెయ్యిని తీసి ఆహుతి చేశాడు. అయినా ఆ దేవుడికి ఆకలి తీరలేదేమో అన్నపూర్ణను పొట్టన పెట్టుకొన్నాడు. పంతులు పొట్ట మీద దెబ్బ తీశాడు,

భార్య పోయినందుకు కొన్నాళ్లు -

తర్వాత చాలా రోజుల వరకు పంతులు వంటలకి వప్పుకోలేదు.

చిన్నప్పట్నుంచీ గాడీ పొయ్యి అతనిపై కక్షసాధిస్తూంది.

పదేళ్ల వయసులో —

గోదావరిలో మునుగీత కొడుతూ, తేలుతూ డబ్బులు ఏరుకొంటున్నాడు. చేతులనిండా చిల్లర నాణాలే ! సంతోషంతో తుళ్లి తుళ్లి పడుతున్నాడు.

గట్టు మీంచి అమ్మ కేక ఏడుపు గొంతుతో వినిపించింది.

"అమ్మా ! ఏమయిందీ !" అని పెద్ద పెద్ద బారలు వేసి గట్టును చేరుకొనే సరికి

"నాన్న గాడీలో పడ్డాడే తండ్రీ" అంటూ ఏడ్చిందామె.

వెళ్లి చూశాడు.

తండ్రి శవం నూనెలో పేలిన పచ్చిమిరపలా ఉంది.

కాలిన కొరకంచులా నల్లగా ఉంది.

తర్వాత మరి పదేళ్లకి --

అదే గాడీ పొయ్యి నుండి మంటలెగసి అమ్మ కళ్లను పోగొట్టాయి. ఆ బాధతో మంచం ఎక్కి తీసుకొని తీసుకొని చనిపోయిందామె.

ఇప్పుడు అన్నపూర్ణ !

పంతులు పిచ్చెక్కి పోయాడు. దాదాపుగా ఆరేడు నెలలు వంటల జోలికి పోలేదు. ఈ లోపు అతని శిష్యులే కొత్త జట్టుగా తయారయ్యారు. పంతులు పేరు వాళ్లకొచ్చింది. దాంతో పంతుల్ని పిలవడం అంతా మానుకొన్నారు.

శిష్యుల్లో శిష్యుడిగా చేరలేదు పంతులు. అలాగని పెద్దరికాన్ని కూడ అడగలేదు. అతను, అతని వృత్తి మూలన పడ్డాయి.

ఓ సాయంకాలం

శిష్యులంతా కట్టగట్టుకొని పంతులింటికి వచ్చారు. నమస్కరించారు.

"మీరు నేర్పిన విద్య మాకింత కూడు, గూడును కలుగజేస్తోంది. అందుకు కృతజ్ఞతగా...." అంటూ ఎర్రరాళ్ళు పొదిగిన బంగారు కడియాన్ని అతని కాలికి తొడిగారు. అప్పుడతను పాల పొంగయ్యాడు. కళ్ళంట పాలు పొర్లాయి. పేరు పేరునా అందర్నీ కౌగిలించుకొని ఆశీర్వదించాడు.

'నాతో పాటే ఇదీ...." అని కాలికున్న కడియాన్ని ఆప్యాయంగా చూసుకొన్నాడు.

వాళ్లు వెళ్లి పోయారు.

అతను మిగిలిపోయాడు.

తర్వాతర్వాత వాళ్లూ ఎటు వంటి వంట పనులూ లేక ఖాళీగా మిగిలిపోయారు.

సంప్రదాయంలో మార్పులొచ్చాయి.

సంస్కృతిలో మార్పులు సంభవించాయి.

నవీన నాగరికత నాలుగు చెరగులా పాకింది.

పెళ్లిళ్లు ఇళ్లలో జరగడం లేదు. పూర్వంలా వారం, పది రోజుల పెళ్లిళ్లు అసలు లేనేలేవు. వందలాది మంది బంతులు తీరి కూర్చుని భోజనాలు చేయడం. ఆ భోజనాలు వంట బ్రహ్మలు వండి, వార్చడం లేవు.

ఉదయం ఉపనయనం—

మధ్యాహ్నం పెళ్లి —

రాత్రి శోభనం—

ఆహూతులు లెక్కపెట్టినట్టుగా వస్తున్నారు. లెక్కగట్టినట్టే నాలుగంటే నాలుగే నిమిషాలుండి వెళ్లి పోతున్నారు.

కొంచెం కలిగిన వాళ్లయితే-

హోటల్స్‌ను బుక్ చేస్తున్నారు. యూనిఫామ్‌ల్లో సర్వర్లు సర్వ్ చేస్తూంటే 'బఫే' డిన్నర్లు బలంపుంజు కొన్నాయి.

కోవెల పెళ్లిళ్లు-

ప్రైవేట్ కళ్యాణ మంటపాలూ వెలిశాయి. పెళ్లికూతురు, పెళ్లి కొడుకూ ఉంటే చాలు! పెళ్లిళ్ల ఆయా సంస్థల వారు నిర్విఘ్నంగా జరిపిస్తున్నారు. ప్రస్తుతం అటువంటి సంస్థలే పెళ్లికూతురికి - పెళ్లికొడుకుని; పెళ్లికొడుక్కి - పెళ్లికూతుర్ని కూడా చూసేసి—

సంబంధాలు కలిపేసి-

కులాల పేరిట ప్రముఖంగా వర్ధిల్లుతున్నాయి.

ఎవరికి కావాలి పచ్చి పులుసు?

ఎవరికి కావాలి వంకాయ, జీనుగుల ముద్ద!?

కావాల్సింది అవి కానేకావు.

బిర్యానీ!

చికెన్ బిర్యానీ!

మటన్ బిర్యానీ కావాలి! అవి చేయడం పంతులుకి చేతనవునా!?

కాదు.

అందుకే-

దీపం లేని దేవుడిగుడిలా పంతులు!

లోకం తెలియని పసిపాపలా పంతులు!

పంతులు ఆకలికి కనలి పోతున్నాడు. గట్టునపడ్డ చేప పిల్లలా ఉందతని పరిస్థితి. అతని కళ్లలో గోదావరి!

అరటిదొప్ప సాయంతో క్రూరాడెవరో గోదావరిలో ఎగువకి ఈదుతున్నాడు, ఆత్రంగా వెళ్తున్నాడు. జీడిమామిడి పళ్లతో చెట్టుకొట్టుకొస్తోంది. ఆబగా దాన్ని అందుకొంటున్నాడు.

ఆకలి పోరాటం అది! ఆ పోరాటంలోనే ఆఖరికి తడి, మడి విడిచిపెట్టి—

నగరంలో ఉన్న అధునాతన ఉడిపి బ్రాహ్మణ హోటల్‌కి పని చేసేందుకు వెళ్లాడు. అక్కడి సూపర్‌వైజర్‌కి పొట్టను రెండు చేతుల్తోనూ చూపించి, చేతులెత్తి నమస్కరించాడు.

"ఏం చేస్తావు"

"వంటలు"

"డిప్లొమా ఉందా"

ఆ మాట అర్థం కాలేదు పంతులికి. అదేమయినా అటువంటిది ఏదీ అతని దగ్గర లేదని చెప్పాడు.

"అయితే పనికిరావు" అన్నాడు.

పంతులు నిరాశగా వెను తిరిగాడు. అతని వెనక తెల్లని ఎత్తు టోపీల్లో, తెల్లనయిన బట్టల్లో, తెలతెల్లని ఏప్రాన్లలో కుక్స్!

వాళ్లంతా నవ్వుకొంటున్నారు.

ఇంగ్లీషులో మాట్లాడు కొంటున్నారు. పరబ్రహ్మ స్వరూపాన్ని 'రైస్' అంటున్నారు.

పంతులుకి నవ్వు రాలేదు.

ఏడుపు అంతకన్నా రాలేదు.

రెండూ కలగలిసిన భావం—

గోదావరి పరవళ్ల 'తొక్కుతూ పాపి కొండల వరకు యాత్రికులను పల్టీ కొట్టిస్తే—

తల్లి గోదావరిని చూసి ఆనందించాలో

ఘోరంగా బలయిన యాత్రికుల్ని చూసి

దుఃఖించాలో తెలియనట్టు

నిర్లిప్తత అతనిలో చోటు చేసుకుంది.

గత మూడు రోజులుగా అతను ఆ నిర్లిప్తతలోనే ఉన్నాడు. అయినా ఆకలి వేస్తోంది. అడుక్కోడు. కష్టపడతానంటాడు. అతనికి చేతనయిన కష్టం ఇంకెవరికి ఇష్టంలేదు.

ఏం చేస్తాడు?

ఏం చేయగలడు?

గట్టుమీంచి గోదావరి లోనికి దిగాడు. దోసిలిపట్టి నీరు తీశాడు. కడపు నిండుగా తాగాడు. 'త్రేవ్'మని త్రేన్చాడు. అలవాటుగా—

'అన్నదాత! సుఖీభవ!'

అని ఆశీర్వదించాడు.

అతని కాళ్లపై గోదావరి మోకరిల్లింది.

# ప్రయాణించే పాదాలు

## శ్రీ రామా చంద్రమౌళి

ప్రయాణించే పాదాలు ఒక్క క్షణం ఆగిపోతే
హృదయం నిండా ద్రవాన్ని కోల్పోయిన సీసాలా ఒట్టి శూన్యం
అలసట ప్రవాహాన్ని తెంపే ఓ ఇసుక మేట తన్నుకు పోవాలి దాన్ని దాటుకుని
పరిస్థితులు, బాధ్యతలు ఎప్పుడూ సంకెళ్ళను విసిరే శత్రువులే
విజ్ఞత, ధైర్యం - పోరాటం ఇవీ మనను ముందుకు నడిపించుకు పోయే సహచరులు
'రాజ్' అనే శబ్దం ఓ పిరికివాడు కప్పుకునే దుప్పటి –
తల వంచుకుని నడచిపోవడం ఎంత వికారంగా ఉంటుందో ఊహిస్తున్నాను,
గుడ్డుపొచ్చెను చీల్చుకుని పక్షి బయటికి వచ్చినట్టు
ధైర్యం శూలంతో గుండె జెండాను ఎగురేసుకుంటూ
చూపులను నక్షత్ర శ్రేణుల్లోకి సంధించి లక్ష్యాలను సాధిస్తూంటే
ఓహ్ ఏది నీకు లొంగనిది. ఏది నీకు చెందనిది. ఏది నీది కానిది.
"ప్రశ్న" అనే ద్వీపం చుట్టూ
సమస్య లెప్పుడూ సముద్రాలే ... ముంచేయాలని గర్జిస్తాయి
ఆలోచనలను విదిలించి సాధనతో విక్రమిస్తే
చరిత్ర నీ వశమౌతుంది
చూచి, విని, పొందీ ఆనందించడం కాదు
ఆనందింప జేయడం నేర్చుకో
సృష్టివి కావడం కాదు సృష్టి కర్తవు కావడం నేర్చుకో